ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
శుక్రవారం 2 ఆగస్టు 2024



చిన్నారులు, వారి తల్లిదండ్రులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ (సర్కిల్‌లో)

నవజాత శిశువుకు తల్లి పాలే శ్రేష్ఠం

● కలెక్టర్ సత్యశారద ● జక్కలొద్దిలో తల్లిపాల వారోత్సవాలు

శంభునిపేట, ఆగస్టు 1: నవజాతి శిశువుకు తల్లిపాలే శ్రేష్ఠమని, బిడ్డ జన్మించిన గంటలోపే తల్లి ముర్రుపాలు పట్టించటం బిడ్డ ఆరోగ్యం ఎదుగుదలకు దోహదపడుతుందని కలెక్టర్ సత్యశారద అన్నారు. 43వ డివిజన్ జక్కలొద్ది అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీవో ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ ఆరు మాసాల వరకు తప్పకుండా తల్లి పాలను బిడ్డకు పట్టించాలని సూచించారు. తలి పాలతో రోగనిరోధక శక్తి పెరగడంతో బిడ్డ ఎదుగుదలకు కావాల్సిన పోషకాలు అందుతాయన్నారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహించే తల్లి పాల వారోత్సవాలను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కింద కూర్చొని ముచ్చటించి..

తల్లిపాల వారోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన కలెక్టర్ చిన్నారులతో ముచ్చటించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, వారి తల్లిదండ్రులతోపాటే కింద కుర్చొని వారి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. అంగన్‌వాడీలో సేవలు, పథకాలను గర్భిణులు, బాలింతను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈదురు అరుణ, జిల్లా సంక్షేమ అధికారి హైమావతి, సీడీపీఓ, సూపర్‌వైజర్స్ అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లి పాల వారోత్సవాలపై విస్తృత ప్రచారం కల్పించాలి

వరంగల్ కలెక్టరేట్: శిశువుకు తల్లిపాలే రక్ష అని, తల్లిపాల వారోత్సవాలపై జిల్లాలో విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా సంక్షేమ అధికారి హైమావతి, డీఎంహెచ్ఓ వెంకటరమణ,ఆర్డీవో కృష్ణవేణి పాల్గొన్నారు.

కోచ్ తూచ్!



‘రాష్ట్ర విభజన’ హామీని విస్మరించిన కేంద్రం

- కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీకి కొర్రీలు
- 1982, 2004లో మంజూరైనా.. ఇతర రాష్ట్రాలకు తరలింపు
- చివరకు వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు
- రైల్వే డివిజన్ విషయంలోనూ పేచీలే
- అన్ని అర్హతలున్నా డివిజన్‌కు నోచుకోని కాజీపేట రైల్వే జంక్షన్
- కోచ్ ఫ్యాక్టరీ వస్తే 60వేల మందికి ఉపాధి.. వ్యాగన్‌తో అయితే 2వేల మందికే..
- దక్షిణ మధ్య రైల్వేకు గేట్‌వేగా ఉన్నా అభివృద్ధిపై నిర్లక్ష్యం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ ఏర్పాటు కలగానే మారుతున్నాయి. 55ఏళ్లుగా కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రజలు, ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారు. 2014లో ఏపీ విభజన చట్టంలో ఇచ్చిన కోచ్ ఫ్యాక్టరీ హామీపై కూడా కేంద్ర ప్రభుత్వం ‘తూచ్’ అన్నట్టుగానే వ్యవహరిస్తోంది. కోచ్ ఫ్యాక్టరీకి బదులు 2023లో వ్యాగన్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంది. వేలాది మందికి ఉపాధిని కల్పించే కోచ్ ఫ్యాక్టరీని కాదని, వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేయటంపై స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో ‘వ్యాగన్ వద్దు.. కోచ్ ఫ్యాక్టరీ ముద్దు’ అంటూ ఓరుగల్లువాసులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు దక్షిణ భారతదేశ రైల్వేకు గేట్‌వేగా ఉన్న కాజీపేట రైల్వే జంక్షన్‌ను డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన పట్టాలెక్కటం లేదు.

కాజీపేట చేజారిన కోచ్ ఫ్యాక్టరీ..

కాజీపేట రైల్వే స్టేషన్ ఉత్తర, దక్షిణ భారత దేశానికి వారిధిగా నిజాం కాలంలోనే నిర్మించారు. కాశీ నుంచి కన్యా కుమారి, చెన్నై నుంచి కోల్‌కత్తా, హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు.. ఎక్కడికి వెళ్లాలనుకున్నా కాజీపేట రైల్వే స్టేషన్ మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. దక్షిణ మధ్య రైల్వేలో అత్యధిక ఆదాయం వచ్చే ప్రాంతం కావటంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉపాధి అవకాశాలు తక్కువగా ఉండటంతో 1969లోనే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు మొదలయ్యాయి. అప్పటి కమ్యూనిస్టు నేతలు బీఆర్ భగవాన్‌దాసు, కాళీదాసు నేతృత్వంలో మొదలైన కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. 1978-80లో అన్ని పార్టీలు తమ జెండాలను పక్కన పెట్టి అఖిల పక్షంగా ఏర్పడి కోచ్ ఫ్యాక్టరీ కోసం ఉద్యమాలకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో హనుమకొండ ఎంపీగా ఉన్న పీవీ.నర్సింహరావు కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ కోసం చొరవ తీసుకుని అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ వద్దకు అఖిల పక్ష నేతలను తీసుకెళ్లారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై అఖిల పక్ష నేతల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకున్న ఇందిరాగాంధీ 1982లో పార్లమెంట్ వేదికగా కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే 1984లో ఇందిరాగాంధీ హత్యకు గురవడంతో, ఖలిస్థాన్ ఉద్యమాన్ని చల్లార్చడానికి కాజీపేటకు మంజూరైన కోచ్ ఫ్యాక్టరీని పంజాబ్‌లోని కబుర్తాలకు తరలించారు. ఇక 2004లో యుపీఏ ప్రభుత్వంలో ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ మరోసారి కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే కాజీపేటకు మంజూరైన కోచ్‌ఫ్యాక్టరీ రాజకీయ కారణాలతో యూపీలోని రాయబరేలికి తరలిపోవటంతో రెండోసారి కూడా కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ దక్కకుండా పోయింది. ఆ తరువాత 2010-11 బడ్జెట్‌లో అప్పటి రైల్వే మంత్రి మమత బెనర్జీ ప్రభుత్వ

మిగతా 8వ పేజీలు »

కోచ్ అడిగితే.. వ్యాగన్ ఇచ్చిన మోదీ..

రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని ప్రకటించిన గత కేంద్ర ప్రభుత్వం 150 ఎకరాల స్థలాన్ని కూడా కేటాయించింది. కానీ 2017లో కేంద్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడ కూడా కోచ్ ఫ్యాక్టరీల అవసరం లేదని స్పష్టం చేసి.. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని ఇవ్వలేమని చెప్పిందని పరోక్షంగా అంగీకరించిందని అందరూ భావించారు. అయితే 2018 ఏప్రిల్‌లో మహారాష్ట్రలోని లాతూరులో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాటు రూ.625కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద రైల్వే జంక్షన్‌గా ఉన్న కాజీపేటపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, తెలంగాణ నుంచి ఒత్తిడి పెరగటంతో కేంద్ర ప్రభుత్వం 2023 జూలై 8వ తేదీన కాజీపేటలో 160 ఎకరాల్లో రైల్వేవ్యాగన్ తయారీ పరిశ్రమను ఏర్పాటుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వయంగా భూమి పూజ నిర్వహించారు. 2025లోపు పూర్తయ్యేలా రూ.521కోట్లతో ఈ వ్యాగన్ పరిశ్రమను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ పనులు జరుగుతున్నాయి. అయితే కోచ్ ఫ్యాక్టరీ డిమాండ్ చేస్తే కేంద్ర ప్రభుత్వం వ్యాగన్ పరిశ్రమను ఏర్పాటు చేయటంపై ఓరుగల్లువాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వ్యాగన్‌నే అప్‌గ్రేడ్ చేసి కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి
- దేవులపల్లి రాఘవేందర్, రాష్ట్ర రైల్వే ఉద్యోగుల జేఏసీ చైర్మన్



కాజీపేటలో ఏర్పాటు చేసిన వ్యాగన్ పరిశ్రమనే అప్‌గ్రేడ్ చేసి కోచ్ ఫ్యాక్టరీగా ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 20ఎకరాల్లో కూడా కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయవచ్చు. ఈ కోచ్‌ఫ్యాక్టరీతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. అలాగే దక్షిణమధ్య రైల్వేకు వచ్చే ఆదాయంలో అధిక ఆదాయం కాజీపేట నుంచే వస్తుంది. రైల్వే డివిజన్ ఏర్పాటుకు కాజీపేటకు అన్ని అర్హతలున్నాయి. కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ సాధించే వరకు ఉద్యోగ జేఏసీ పోరాటం చేస్తుంది.

బీజేపీ ఎంపీల అసమర్థత వల్లే..
- నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే



విభజన చట్టాలను నెరవేరుస్తారన్న ఆకాంక్షతోనే ప్రజలు బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలను ఇచ్చారు. కానీ ఆ ఎంపీల అసమర్థత మూలంగానే తెలంగాణలో కీలకమైన కాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ రావటం లేదు. ఏపీ, బిహార్‌కు ఇచ్చిన ప్రాధాన్యం కేంద్రం తెలంగాణకు ఇవ్వటం లేదు. కోచ్ ఫ్యాక్టరీతో పాటు రైల్వే డివిజన్ కోసం క్షేత్రస్థాయి నుంచి ఢిల్లీ వరకు కాంగ్రెస్ పోరాడుతుంది. వచ్చే ఎన్నికల్లో రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి కాగానే విభజన చట్టంలోని హామీలను అమలు చేసి తీరుతాం. కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీతో పాటు డివిజన్‌ను తీసుకొస్తాం.



నిర్మాణంలో ఉన్న వ్యాగన్ ఫ్యాక్టరీ

అట్రాసిటీ కేసుల్లో న్యాయం జరగాలి

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 1: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని, బాధితులకు సత్వర న్యాయం జరగాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ వివిధ అంశాలపై చర్చించి కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం మాట్లాడుతూ పెండింగ్ ట్రయల్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి నెల తప్పనిసరిగా గ్రామాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించే సమావేశానికి తహసీల్దార్, సంబంధిత శాఖల అధికారులు హాజరు కావాలని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి భాగ్యలక్ష్మీ, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ రవీందర్, జడ్పీ సీఈవో రాంరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాల్, గిరిజన సంక్షేమ అధికారి సౌజన్య, జిల్లా సంక్షేమ అధికారి హైమావతి, ఏసీపీలు సురేశ్, కిరణ్, ఎస్‌హెచ్‌ఓ శివకుమార్, క్రాంతికుమార్, తిరుపతి పాల్గొన్నారు.

నెక్కొండలో రైళ్లకు హాల్టింగ్ ఇప్పించండి

కేంద్ర రైల్వే మంత్రిని కోరిన ఎంపీ, ఎమ్మెల్యే

నెక్కొండ, ఆగస్టు 1 : నర్సంపేట నియోజకవర్గంలోని ఏకైక రైల్వే స్టేషన్ నెక్కొండలో సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇప్పించడంతోపాటు రైల్వే స్టేషన్‌ను అభివృద్ధిపర్చాలని కోరుతూ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినివైష్ణవ్‌ను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, ఎంపీ బలరాంనాయక్ ఢిల్లీలో గురువారం కలిసి వినతి పత్రం అందించారు. నెక్కొండలో ఇంటర్ సిటీ , శాతవాహన, చార్మినార్, నవజీవన్, షిరిడి, కరీంనగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ ఇప్పించాలని కోరారు. అలాగే రెండో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై బుకింగ్ కార్యాలయం, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని, రెండో ప్లాట్‌ఫామ్ నుంచి మూడో ప్లాట్‌ఫామ్‌కు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేయాలన్నారు. మూడో నంబర్ ప్లాట్ ఫామ్ నుంచి పోలీస్ స్టేషన్ వైపు ఉన్న గ్రామాలకు ప్రజలు వెళ్లడానికి దారి ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి రైల్వే జనరల్ మేనేజర్‌కు ఫోన్‌చేసి సమస్యలను పరిష్కరించాలంటూ ఆదేశాలను జారీ చేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో నర్సంపేట టీపీసీసీ మెంబరు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, కిసాన్ సెల్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, సింగులాల్ పాల్గొన్నారు.



ఢిల్లీలో రైల్వే మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే, ఎంపీలు



కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లతో కొండా మురళీ

కాంగ్రెస్‌లో చేరిన వారిని కాపాడుకుంటాం : కొండా

హస్తం గూటికి 32, 35, 37 డివిజన్ల కార్పొరేటర్లు

వరంగల్ సిటీ, ఆగస్టు 1: కొండా దంపతులపై అభిమానం, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరిన వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అన్నారు. గురువారం ఓ సిటీలోని క్యాంపు కార్యాలయంలో 35వ డివిజన్ కార్పొరేటర్ సొమిశెట్టి ప్రవీణ్, 37వ డివిజన్ కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్, 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మరవి బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. వారికి కొండా మురళి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్పొరేటర్లతోపాటు సుమారు వందమంది యువకులు కాంగ్రెస్‌లో చేరారు. కొండా మురళీధర్‌రావు మాట్లాడుతూ.. వరంగల్ తూర్పు నియోజకవర్గం ప్రజలు తన కుటుంబ సభ్యులాంటి వారన్నారు. నియోజకవర్గాన్ని రూ.500 కోట్లతో అభివృద్ధి చేసేందుకు పక్కా ప్రణాళిక రూపొందించామని, త్వరలోనే సీఎం ను కలిసి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. అలాగే యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు శిక్షణ ఇప్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తుండడంతో బీఆర్‌ఎస్‌కు ఏం చేయాలో పాలుపోక, చిల్లరమల్లర పనులు చేస్తూ ప్రజల్లో చులకనైపోతోందని ఆరోపించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, నాయకులు గోపాల నవీన్‌రాజ్, ఎండి. ఆయూబ్, శంకర్‌రెడ్డి, నారగోని మురళీ, దాసరి రాజేష్, కూచన రవిందర్, జారతి రమేష్, కేడల పద్మ, జనార్దన్, మోయిన్, జన్ను ప్రవీణ్, కరాటే ప్రభాకర్, దాడి శివ, శ్రీరాం రాజేష్ పాల్గొన్నారు.

మార్కెటింగ్‌శాఖ వరంగల్ రీజియన్ జేడీగా శ్రీనివాస్

డిప్యూటీ డైరెక్టర్‌గా పద్మావతి



శ్రీనివాస్



పద్మావతి

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 1: మార్కెటింగ్ శాఖలో పలువురు అధికారులను బదిలీ చేస్తూ బుధవారం రాత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ మల్లేశం హైదరాబాద్ రీజియన్ జాయింట్ డైరెక్టర్‌గా బదిలీ అవగా హైదరాబాద్ రీజియన్ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఉప్పుల శ్రీనివాస్‌ను వరంగల్ రీజియన్ జేడీగా నియమితులయ్యారు. ఇంతకాలం పోస్టింగ్ కోసం ఎదురు చూసిన వై.అశోక్‌ను హైదరాబాద్ రీజియన్ జాయింట్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. వరంగల్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న అజ్మీర రాజు హైదరాబాద్‌లోని మార్కెటింగ్‌శాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. వరంగల్ జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్, నర్సంపేట సెక్రటరీ ప్రసాదరావు హైదరాబాద్ రీజియన్ డీడీగా బదిలీ చేశారు. ఇక వరంగల్ డీడీగా సుల్తానాబాద్ మార్కెట్ స్పెషల్‌గ్రేడ్ సెక్రటరీ వి.పద్మావతిని డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. ములుగు మార్కెట్ స్పెషల్ గ్రేడ్ సెక్రటరీగా పనిచేస్తున్న వి.సుచరిత్రను భద్రాద్రి జిల్లా ఇల్లందు మార్కెట్ కమిటీకి బదిలీ చేశారు.

వీరిలో వరంగల్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీపై వచ్చిన వి.పద్మావతి గురువారం లక్ష్మీపురం లోని మార్కెటింగ్‌శాఖ కార్యాలయంలో డీడీగా బాధ్యతలు స్వీకరించారు. అలాగే మార్కెటింగ్ శాఖ ఇంజనీరింగ్ సెక్షన్‌లోనూ బదిలీలు అయ్యాయి. వరంగల్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న లక్ష్మణ్ గౌడ్‌ను హైదరాబాద్‌కు బదిలీ చేశారు. హైదరాబాద్‌లో ఎగ్జికూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న ఎం.సుజాతను వరంగల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా నియమించారు. వరంగల్ మార్కెట్ కమిటీ డీఈగా పనిచేస్తున్న ఎల్లేశం ఖమ్మం బదిలీ అయ్యారు.

మహిళలకు సీఎం క్షమాపణ చెప్పాలి

● మాజీ ఎమ్మెల్యే నరేందర్ ● సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నం



వరంగల్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మట్టెవాడ, ఆగస్టు 1: మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని అసెంబ్లీ వేదికగా మహిళా ప్రజాప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ డిమాండ్ చేశారు. సీఎం వ్యవహరించిన తీరుకు నిరసనగా గురువారం వరంగల్ తూర్పు బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి సీఎం దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించగా ఇంతేజార్‌గంజ్ పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం నరేందర్ మాట్లాడుతూ మాజీ మంత్రి, సీనియర్ ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిపై, ఇతర మహిళలపై సీఎం చేసిన వ్యాఖ్యలను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలన్నారు. సీఎం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు చేతకాక కాంగ్రెస్ ప్రజల తరపున ప్రశ్నించే బీఆర్‌ఎస్ నాయకుపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మరుపల్ల రవి, బీఆర్‌ఎస్ నాయకులు పుష్పితలయ, తుమికి రమేశ్‌బాబు, వివిధ డివిజన్ల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద మృతి

- ఘటనపై కుటుంబసభ్యుల అనుమానాలు
- వైబ్రంట్ అకాడమీ ఎదుట విద్యార్థుల ధర్నా, ఫర్నీచర్ ధ్వంసం
- కళాశాలకు అనుమతులు లేవని వెల్లడించిన అధికారులు
- యాజమాన్యంపై కఠినచర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల డిమాండ్



భవానిరెడ్డి(ఫైల్)

వివరాలు 8లో..

ఐదుగురు సీఐలు, ఏడుగురు ఎస్ఐల బదిలీ

వరంగల్ క్రైం, ఆగస్టు 1 : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఐదుగురు సీఐలు, ఏడుగురు ఎస్ఐలను వివిధ పోలీస్ స్టేషన్‌లకు బదిలీ చేస్తూ గురువారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు.

బదిలీ అయిన సీఐలు

ఎ.శ్రీనివాస్‌రెడ్డి వీఆర్ నుంచి రఘునాథ్‌పల్లి, ఇ.శ్రీనివాస్ రఘునాథ్‌పల్లి నుంచి కమిషనరేట్, ఎ.ప్రవీణ్‌కుమార్ ఎల్కతుర్తి నుంచి ధర్మసాగర్, ఎ.మహేందర్ ధర్మసాగర్ నుంచి సీసీఎస్ వరంగల్, జి.వేణు మల్టీజోన్ నుంచి స్టేషన్‌ఘన్‌పూర్.

ఎస్ఐలు వీరే..

బండి శ్రావణ్‌కుమార్ కొడకండ్ల నుంచి లింగాలఘనపూర్, సీహెచ్.రాజు లింగాలఘనపూర్ నుంచి ఇంతెజార్‌గంజ్, బానోత్ రాంచరణ్ కేయూసీ నుంచి జాఫర్‌గఢ్, ఎ.సురేష్ వీఆర్ నుంచి వేలేర్, డి.హరిత వేలేర్ నుంచి సుబేదారి, ఎస్.నవీన్‌కుమార్ వీఆర్ నుంచి చిల్పూర్, ఎం.రాజేందర్ చిల్పూర్ నుంచి కేయూసీకి బదిలీ అయ్యారు.

రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 1 : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండలోని జేఎన్ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి ఒక ప్రకటనలో తెలిపారు.

డెంగీకి నిండు గర్భిణి బలి

గర్భస్థ కవల శిశువులు సహా కన్నుమూత

శాయంపేట, ఆగస్టు 1: మరో వారం పది రోజుల్లో పురుడు పోసుకుని పండండి ఇద్దరు కవల ఆడపిల్లలకు జన్మనివ్వాల్సిన ఆ తల్లిని డెంగీ జ్వరం బలితీసుకుంది. గర్భంలో ఉన్న పిల్లలు సహా తల్లి మృతి చెందిన విషాదకరమైన ఘటన హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గట్లకానిపర్తి గ్రామానికి చెందిన బొమ్మకంటి శ్రీకాంత్ ప్రింటర్స్ సర్వీస్ చేస్తూ జీవిస్తున్నాడు. రెండేళ్ల క్రితం పరకాల మండలం మల్లక్కపేట గ్రామానికి చెందిన దొమ్మాటి లక్ష్మి-భిక్షపతి దంపతుల మొదటి కుమార్తె అయిన ప్రియాంకతో శ్రీకాంత్ వివాహం జరిగింది. కొద్దికాలంలోనే ప్రియాంక అనారోగ్యంతో మృతి చెందింది. అనంతరం భిక్షపతి కూడా అనారోగ్యంతో మృతి చెందాడు. భిక్షపతి రెండో కూతురు అయిన శిరీష(29)ను కుటుంబసభ్యులు శ్రీకాంత్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. ఈ నేపథ్యంలో నిండు గర్భిణి అయిన శిరీష మూడు రోజుల క్రితం డెంగీ జ్వరం బారిన పడగా ఆమెను హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. రక్తకణాలు పూర్తిగా పడిపోవడం, గురువారం ఆమె పరిస్థితి తీవ్ర విషమంగా మారడంతో కనీసం గర్భంలో ఉన్న కవల శిశువులనైనా బతికించాలని డాక్టర్లు ప్రయత్నం చేశారు. కానీ వారి ప్రయత్నం ఫలించలేదు. గర్భస్థ శిశువులు సహా శిరీష మృతి చెందింది. కుటుంబంలో వరుస విషాద సంఘటనలు జరగడంతో వారి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తీవ్ర విషాదంలో మునిగారు.

బీసీల అభివృద్ధికి రూ. 20 వేల కోట్ల కేటాయించాలి

కాజీపేట, ఆగస్టు 1: బీసీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ. 20 వేల కోట్లు కేటాయించాలని, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ కోల జనార్ధన్ డిమాండ్ చేశారు. కాజీపేట మీడియా పాయింట్‌లో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బీసీ సమస్యల పరిష్కారానికి ఆగస్టు 4న హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మీడియా సమావేశంలో బీసీ సంఘాల నాయకులు సాధినేని సుధాకర్, మాచర్ల శరత్ కుమార్, గొల్లపల్లి వీరస్వామి, తాడిశెట్టి క్రాంతికుమార్, దువ్వ కనుకరాజ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాజీపేట, ఆగస్టు 1 : రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వ్యక్తి చికిత్సపొదుతూ మృతి చెందాడు..కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాజీపేట ప్రశాంత్‌నగర్ కు చెందిన ఎస్‌డీ అలీ (40), ఈ నెల 25న బైక్‌పై నిట్ నుంచి తన ఇంటికి వెళ్తుండగా గుర్తు తెలియని ఆటో ఢీకొంది. ఈ ఘటనలో ఎస్‌డీ అలీకి తీవ్రగాయాలుకాగా చికిత్స నిమిత్తం కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

ఆగస్టు, సెప్టెంబరులోనూ జోరు వానలు!

» భారత వాతావరణ శాఖ అంచనా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి అర్థభాగం మంచి వర్షాలు కురిశాయి. అదేజోరు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొనసాగనుంది. రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాలిక సగటులో 106 శాతం) నమోదవుతుంది. అయితే ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, సౌరాష్ట్ర, లద్దాక్, మధ్య, దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టు నెలలో ఈశాన్య రాష్ట్రాలు, వాయవ్య, మధ్య, తూర్పు, దక్షిణాదిలో పలు భాగాలు, కశ్మీర్, లద్దాక్ వంటి ప్రాంతాలు తప్ప దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఈ మేరకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి ముందస్తు అంచనా నివేదికను వాతావరణ శాఖ గురువారం విడుదల చేసింది. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దేశంలో 422.8 మి.మీ వర్షపాతం (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 106 శాతం) నమోదవుతుందని తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఆగస్టులో దేశంలో 254.9 మి.మీ. (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 94 నుంచి 106 శాతం వరకు) నమోదు కానుంది. ఆగస్టులో దక్షిణాది రాష్ట్రాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. కాగా, ఆగస్టులో దక్షిణ కోస్తా, సీమల్లో ఎక్కువ, ఉత్తర కోస్తాలో తక్కువ వర్షాలు ఆగస్టు నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. ఉత్తర కోస్తాలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయి. ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తాలతోపాటు, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఇదీ జాతీయ విపత్తే

మా నాన్నను కోల్పోయినప్పటి పరిస్థితి గుర్తుకొచ్చింది: రాహుల్‌గాంధీ

» సోదరి ప్రియాంకతో కలిసి.. ముండక్కై, చురాల్‌మలలో పర్యటన

» జాతీయ విపత్తుగా ప్రకటించాలి: పినరయి

» 289కి పెరిగిన మరణాలు



పునరావాస శిబిరంలో బాధితులను ఓదారుస్తున్న రాహుల్, ప్రియాంక

వయనాడ్, ఆగస్టు 1: "వయనాడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దృశ్యాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మా నాన్న చనిపోయినప్పుడు ఎలా ఉండేదో.. ఇప్పుడు అలాంటి బాధనే ఎదుర్కొంటున్నాను. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తే" అని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఉద్వేగంతో అన్నారు. గురువారం ఆయన తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్‌లో కొండచరియల బాధిత ప్రాంతాలు-- ముండక్కై, చురాల్‌మల, అట్టమల, మెప్పాడిలో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో, ఆస్పత్రుల్లో బాధితులతో మాట్లాడారు. "దేశం మీ వెన్నంటే ఉంది.." అంటూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇది బాధాకరమైన పరిస్థితి అని.. పినరయి ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా సాయం చేయడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ముందే హెచ్చరించామంటూ లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. "ఇది రాజకీయ ఘర్షణకు సమయం కాదు. అన్ని వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన తరుణమిది" అని వ్యా ఖ్యానించారు. కరోనా కష్టకాలంలో తాను, ప్రియాంక వయనాడ్ ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తుచేస్తూ.. ఇప్పుడు కూడా సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇదే విషయాన్ని తన ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్ట్ చేశారు. మరోవైపు కేరళ సీఎం పినరయి విజయన్ కూడా వయనాడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 280కి పైగా పౌరులు చనిపోయారని, కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ విపత్తుగా ప్రకటించడానికి అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సైన్యం, రెస్క్యూ వర్కర్లు, స్థానికులను ఆయన అభినందించారు. ఆర్మీ జాగిలాలు మృతదేహాలను గుర్తిస్తున్నాయని, నదిలో కొట్టుకుపోయిన శరీర భాగాలను వెలికితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో మృతుల సంఖ్య 289కి పెరిగినట్లు అధికారులు వివరించారు. గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

డార్క్ టూరిజం వద్దు

వయనాడ్‌లో డార్క్ టూరిజానికి రావొద్దంటూ కేరళ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తి చేశారు. దీంతో.. 'డార్క్ టూరిజం' అనే పదం వైరల్‌గా మారింది. 'చెర్నోబిల్ అండ్ ది డార్క్ టూరిస్ట్' టీవీ షోతో ఈ పదం బాగా పాపులర్ అయింది. మరణం, విషాదం, హింస చోటుచేసుకుని, అసాధారణ పరిస్థితులు ఉండే ప్రదేశాలను సందర్శించడాన్ని డార్క్ టూరిజం అంటారు. ఉదాహరణకు ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ (అణు విద్యుత్తు కేంద్రం) ఘటన, కాంబోడియాలో కిల్లింగ్ ఫీల్డ్స్, పోలెండ్‌లోని అష్విట్జ్ క్యాంప్ వంటివి డార్క్ టూరిజం కిందకు వస్తాయి. ఇప్పుడు వయనాడ్‌కు డార్క్ టూరిస్టులు వస్తే.. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడతాయని కేరళ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

హమాస్‌కు భారీ దెబ్బ!

» ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మిలిటరీ చీఫ్ డెయిఫ్ హతం!

» జూలై 13న గాజాలో అంతం చేశాం

» ప్రకటించిన ఇజ్రాయెల్ సైన్యం

» ఆ ప్రకటనను ఖండించిన హమాస్

జెరూసలెం, ఆగస్టు 1: హమాస్‌కు మరో భారీ దెబ్బ తగిలింది. ఇరాన్ రక్షణలో ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురైన మరునాడే హమాస్ మిలిటరీ చీఫ్, ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మహమ్మద్ డెయిఫ్ హతమయ్యాడు. డెయిఫ్‌ను తమ సైన్యం అంతం చేసినట్టు ఇజ్రాయెల్ గురువారం అధికారికంగా ప్రకటించింది. తన ప్రకటనలో ఆపరేషన్ వివరాలను వెల్లడించింది. "మా సైన్యం (ఐడీఎఫ్) గత నెల 13న గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంపై జెట్లతో దాడి చేసింది. అక్కడ హమాస్‌కు చెందిన డిప్యూటీ కమాండరు నివాసంలో డెయిఫ్ ఉన్నట్టు గుర్తించాం. అక్కడ జెట్లతో బాంబులు ప్రయోగించాం. ఈ దాడిలో డెయిఫ్ హతమయ్యాడు" అని ఆ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది అక్టోబరు ఏడున ఇజ్రాయెల్ భూభాగంపై జరిగిన దాడుల ఆలోచన, ప్రణాళిక, అమలు అంతా డెయిఫ్ నేతృత్వంలో జరిగిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో 1197 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. కాగా, డెయిఫ్ మరణవార్తపై హమాస్ స్పందించింది. ఖాన్ యూనిస్‌పై జూలైలో ఇజ్రాయెల్ దాడులు చేసిన మాట నిజమేనని, అందులో 90మంది చనిపోయారని, మృతుల్లో డెయిఫ్ లేరని గాజాలోని హమాస్‌కు చెందిన ఆరోగ్య వర్గాలు ధ్రువీకరించాయి.

కర్ణాటక సీఎంకు గవర్నర్ నోటీసుపై మంత్రివర్గం అభ్యంతరం

» వెనక్కి తీసుకోవాలని ఏకగ్రీవ తీర్మానం

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు అవినీతి వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ నోటీసులు జారీ చేయడంపై మంత్రి వర్గం తీవ్ర అభ్యంతరం తెలిపింది. విధానసౌధలో గురువారం సీఎం సిద్దరామయ్య లేకుండా డీసీఎం డీకే శివకుమార్ అధ్యక్షతన క్యాబినెట్ భేటీ జరిగింది. ముడా అవినీతికి సంబంధించి గవర్నర్ జారీ చేసిన నోటీసులు వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ విషయాన్ని సహకార శాఖ మంత్రి రాజణ్ణ మీడియాకు తెలిపారు. సీఎం సిద్దరామయ్యకు రాజభవన్ నుంచి వచ్చి న షోకాజ్ నోటీసు గురించి చర్చించామని, న్యాయపోరాటం చేయాలని తీర్మానించామని చెప్పారు. గవర్నర్ జారీ చేసిన నోటీసును వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో తీర్మానించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి గవర్నర్ నోటీసు జారీ చేయడం రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. నోటీసులు తిరస్కరించాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

ఉత్తరాది అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)





వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో ధ్వంసమైన రోడ్డు

కోల్పోయారు. కులు జిల్లాలో ఏడుగురు కొట్టుకుపోయారు. మలానా జల విద్యుత్ కేంద్రంలో పలువురు చిక్కుకుపోయారు. బియాస్ నది ఉధృతి, కొండచరియలు విరిగిపడడంతో కీలకమైన మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారి పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది. హిమాచల్ సీఎం సుఖుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాగా, రాష్ట్రంలోని పాలంపూర్, చౌరీలో 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ధర్మశాల (18 సెం.మీ.) సహా పలు ప్రాంతాల్లో 10కి పైగా సెం.మీ. వర్షం పడింది. కంగ్రా, కులు, మండిలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో రాత్రికి రాత్రే వరద పోటెత్తింది. పలు నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. డెహ్రాడూన్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 12 మంది మృతిచెందారు. హరిద్వార్‌లోనే ఆరుగురు చనిపోయారు. ఇక్కడ 21 సెం.మీ. వర్షపాతం నమోదైంది. చాలాచోట్ల 10 సెం.మీ. పైన వాన పడింది. కేదార్‌నాథ్ మార్గంలో 1,500 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వీరిలో 425 మందిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైన్యం, స్థానిక పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలోని చాలా ప్రాంతాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఆరుచోట్ల ఒక్క రోజులోనే 10 సెం.మీ. పైగా వర్షపాతం నమోదైంది. వివిధ ఘటనల్లో ఐదుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. 12 ఏళ్ల బాలుడు, 26 ఏళ్ల యువకుడు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు రాజస్థాన్ రాజధాని జైపూర్‌ను వర్షాలు ముంచెత్తాయి. ఓ ఇంట్లోకి వరద చేరడంతో ఆరేళ్ల బాలిక సహా ముగ్గురు మృతిచెందారు. హిమాచల్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గోవాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

పార్లమెంట్ పైకప్పు లీకేజీ

» బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల మండిపాటు

» లీకేజీ స్వల్పమే.. పరిష్కరించాం: కేంద్రం



న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్త పార్లమెంటు భవనం పైకప్పు లీకవుతోంది. రూ.1,000 కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం లాబీలోని గాజు పైకప్పు నుంచి కింద ఉంచిన బకెట్‌లోకి నీరు ధారగా పడుతున్న వీడియోను సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "కొత్త భవనం కంటే పాత భవనం చాలా మెరుగ్గా ఉంది. వర్షాకాల సమావేశాలను పాతదానిలో ఎందుకు నిర్వహించకూడదు. కనీసం కొత్తదానిలో నీరు కారడం ఆగిపోయే వరకైనా..' అంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. ఈ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త భవనం పైకప్పు నుంచి నీరు లీకవడం.. బాగా ఆలోచించి రూపొందించిన డిజైన్‌లో భాగమా అని ప్రజలు అడుగుతున్నారని ఆయన బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ వీడియోపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ స్పందించారు. "బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్.. నిర్మించిన ఏడాది పూర్తి కాకుండానే పార్లమెంట్ లాబీలో నీరు లీక్ కావడం కొత్త భవనంలో అత్యవసర పునరుద్ధరణ సమస్యలను ఎత్తి చూపుతోంది" అని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై చర్చించడానికి ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లో ఆయన వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. 'రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్లమెంట్ ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడి ఉంది' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని 2023 మే 28న ప్రధాని మోదీ ప్రారంభించారు. కాగా, పైకప్పు గ్లాస్ డోమ్‌లకు ఏర్పాటుచేసిన పట్టీలు వదులుగా ఉండటంతో కొత్త పార్లమెంటు భవనం మకర ద్వారం వద్ద స్వల్పంగా నీరు లీకైందని లోక్‌సభ సెక్రటేరియట్ తెలిపింది. సకాలంలో సమస్యను గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపట్టామని, అంతటితో నీరు కారడం ఆగిపోయిందని కేందర ప్రభుత్వం వివరణ ఇచ్చింది.

రేపు ఎస్సార్ యూనివర్సిటీలో ద్వితీయ స్నాతకోత్సవం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 1: హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని ఎస్సార్ విశ్వవిద్యాలయంలో శనివారం ద్వితీయ స్నాతకోత్సవ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహిస్తున్నామని ఎస్సార్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్. అర్చనారెడ్డి తెలిపారు. గురువారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె స్నాతకోత్సవ వివరాలను వెల్లడించారు. స్నాతకోత్సవ కార్యక్రమానికి సయంట్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ బీవీఆర్. మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. గత 45 ఏళ్లుగా విద్యారంగంలో ఎస్సార్ విద్యాసంస్థలు ముందున్నాయని, 2022లో ప్రైవేటు యూనివర్సిటీగా ఎస్సార్ ఆమోదించబడిందని గుర్తు చేశారు. 2002లో ప్రాంభంమైన ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల అంచెలంచెలుగా ఎదుగుతూ నాక్, ఎన్‌బీఏ, డబ్ల్యుజీసీ అక్రిడిటేషన్లు సాధించిందన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో జాతీయ స్థాయిలో 2023లో 98వ స్థానం సాధించిందన్నారు. నూతన ఆవిష్కరణలతో అటల్ ర్యాంకింగ్స్‌లో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. స్నాతకోత్సవ కార్యక్రమంలో డిగ్రీల ప్రదానంతో పాటు గౌరవ డాక్టరేట్లు, పూర్వ విద్యార్థులకు సత్కారం, కాంక్లేవ్స్, టాసింగ్ ఆఫ్ క్యాప్స్, అధికారిక ఊరేగింపు తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేష్, డాక్టర్ రామ్‌దేశ్‌ముఖ్, డాక్టర్ సుమన్‌కుమార్, డీన్లు, హెడ్స్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సార్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి

ఆత్మగౌరవ పోరాటం ఫలించిన వేళ

» ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు

» వర్గీకరణ పోరాటానికి, నాయకత్వానికి వేదికైన ఓరుగల్లు



హనుమకొండ సిటీ, ఆగస్టు 1: మూడు దశాబ్దాల మాదిగల ఆత్మగౌరవ రక్షణ పోరాటం ఫలించింది. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు తీర్పు చెప్పడంతో మాదిగ జాతి ఆనందడోలికల్లో మునిగితేలుతోంది. వర్గీకరణే లక్ష్యంగా ఎన్నో పోరాటాలు, ఉద్యమాలకు ఓరుగల్లు నుంచే అంకుర్పారణ జరిగింది. ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో ఎంఆర్‌పీఎస్ కమిటీ నిర్మాణం జరిగినా.. అంతకు ముందు నుంచే ఓరుగల్లులో ఎంఆర్‌పీఎస్ స్థాపనపై ఆలోచనలు, సమావేశాలు, చర్చలు జరిగాయి. ఈ మహోత్తర పోరాటానికి వ్యవస్థ నిర్మాణమే కాదు నాయకత్వం వహించిన నాయకుడు మందకృష్ణ మాదిగ ఓరుగల్లు వాసే. పోరుగల్లు పోరాట వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న ఆయన లక్ష్య సాధన వైపు అడుగులు వేయగా.. ఆయన వెంట మాదిగ జాతి యావత్తు నడిచింది. పోరాట క్రమంలో అభిప్రాయభేదాలు వచ్చినా.. అప్పటి వరకు ఒక్కటిగా ఉన్న మాదిగ సంఘాలు వేరయినా.. అందరి లక్ష్యం 'వర్గీకరణే' అన్నట్టుగా పోరు సాగింది. చివరకు గురువారం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో దేశ చరిత్రలో ఓ మహాఘట్టం ఆవిష్కృత మైంది. విద్య, ఉద్యోగాల్లో మాదిగ జాతి అభ్యర్థులకు సముచిత న్యాయం దక్కే అవకాశం వచ్చింది.

పోరాటంలో ఓరుగల్లుదే కీలక పాత్ర

ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా మూడు దశాబ్దాల పాటు సాగిన పోరాటంలో ఓరు గల్లు కీలకపాత్ర పోషించింది. హనుమకొండ హంటర్‌రోడ్డు న్యూశాయంపేటకు చెందిన మందకృష్ణ మాదిగ అడుగు ముందుకేశారు. 1994 జూలై 7న ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో 20మంది యువకులతో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని ఏర్పాటు చేసిన అదే రోజున గ్రామ కమిటీని నియమించారు. అనంతరం రాష్ట్ర కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టిన మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఒంగోలు, హైదరబాద్‌లో జరిగిన భారీ బహిరంగ సభలు వర్గీకరణ పోరాటానికి బలమైన పునాదులు వేశాయి. అనంతరం 1998లో జస్టిస్ రాంచంద్రరాజు కమిషన్ ఏర్పటవగా.. వర్గీకరణకు ఆ కమిషన్ సిఫార్సు చేసింది. నాటి ఉమ్మడి రాష్ట్ర సీఎం చంద్ర బాబు వర్గీకరణకు ఓకే చెప్పడంతో 2004 వరకు 22వేల ఉద్యోగాలు మాదిగ సామాజిక అభ్యర్థులకు లభించాయి. కానీ పార్లమెం ట్‌లో బిల్లు ప్రవేశపెట్టకుండా వర్గీకరణ అమలు చేయడమేంటన్న వివాదాలు తలెత్తడంతో వర్గీకరణకు ఆటంకంఏర్పడింది. దీనిపై మళ్లీ ఉద్యమం రగిలింది. వైయస్ ప్రభుత్వ హయంలో 2004లోనే మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఛలో అసెంబ్లీ పోరాటం చేయడంతో నాటి వైయస్ ప్రభుత్వం వర్గీకరణపై తీర్మానం చేసి కేంద్రానికి పంపింది.

2006లో నాటి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఉషామెహ కమిషన్ వేయగా 2008లో ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించిన కమిషన్ బృందం వర్గీకరణతోనే సామాజిక న్యాయం జరుగుతుందని నివేదిక ఇచ్చింది. ఆ తరువాత తెలంగాణ మలి దశ ఉద్యమం ఆరంభం కావడంతో వర్గీకరణ బిల్లు తెరమరుగైంది. రాష్ట్ర ఆవిర్భావం తరువాత మళ్లీ వర్గీకరణ పోరాటం ఊపందుకుంది. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు వర్గీకరణ అమలు తీర్పును ఇవ్వడంతో మూడు దశాబ్దాల పోరాటానికి విజయంతో ముగింపు వచ్చింది.



జిల్లాలో జరిగిన ముఖ్య ఘట్టాలు..

2006లో ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆందోళనలు చేపట్టారు. ఇందులో భాగం గా కాజీపేటలో అర్ధరాత్రి పుష్‌పుల్ రైలుకు నిప్పంటించారు. ఈ ఘటన దేశ వ్యాప్తంగా వర్గీకరణ ఉద్యమ తీవ్రతను చాటింది. ఇక అదే ఏడాది హైదరాబా ద్‌లో మందకృష్ణ చేపట్టిన ఆమరణ దీక్షలో వరంగల్ జిల్లా నుంచే అత్యధికంగా మేధావులు, యువకులు పాల్గొన్నారు.



వర్గీకరణపై సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

వరంగల్ సిటీ, ఆగస్టు 1: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, తీర్పు వెలువరించిన రాజ్యాంగ ధర్మాసనానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్య, ఉద్యోగ ఇతర రంగాల్లో ఉప కులాలకు ప్రయోజనం చేకూరేలా ఎస్సీఎస్టీ రిజర్వేషన్లను వర్గీకరించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని, అత్యున్నత న్యాయస్థానం తీర్పునిచ్చిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఏబీసీడీ వర్గీకరణ అమలుపై అన్ని రాష్ట్రాలకంటే ముందుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారని తెలిపారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన వెంటనే రిజర్వేషన్ల అంశంపై 2023 డిసెంబరు 23న ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క సూచనల మేరకు మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో ఎమ్మెల్యేలను, అడ్వకేట్ జనరల్‌ను ఢిల్లీకి తీసుకెళ్లి సుప్రీం కోర్టులో కేసు విజయవంతం అయ్యేందుకు చర్యలు తీసుకున్నట్లు ప్రకటనలో స్వర్ణ గుర్తు చేశారు.

ప్రమాదాల నివారణకు కృషి చేద్దాం..

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్‌కిశోర్ ఝా

వరంగల్ క్రైం, ఆగస్టు 1 : రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పని చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. రోడ్డు భద్రతా సమావేశాన్ని గురువారం సీపీ కార్యాలయంలో నిర్వహించారు. వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతోపాటు ట్రాఫిక్ పోలీసులు, విద్యుత్, మునిసిపాలిటీ, ఆర్అండ్‌బీ, అగ్నిమాపకశ, రోడ్డు రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొనగా, ముందుగా ట్రైసిటీ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణను అధిగమించేందుకు ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఇందులో ప్రధానంగా నగరంలోని ఏడు ప్రదేశాల్లో పార్కింగ్ స్థలాల ఏర్పాటు, రోడ్లపై పనిచేయని కరెంట్‌స్తంభాల తొలగింపు, ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన వ్యాపారాలు, ప్రచార బోర్డులతోపాటు, నగరంలో 20కి పైగా ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌తో సహా ప్రధాన రోడ్లను ఆక్రమించి వ్యాపారం నిర్వహిస్తున్న వారిని తొలగింపు తదితర చర్యలపై చర్చించారు. పది ప్రధాన జంక్షన్లలో ఉన్న పాత సిగ్నల్స్ తొలగించడం, అదే విధంగా రద్దీగా ఉన్న జంక్షన్లలో నూతన సిగ్నల్స్ ఏర్పాటుపై తగు సూచనలు చేశారు. పోలీస్ కమిషనర్ చేసిన సూచనలపై ఇరువురు కలెక్టర్లు స్పందిస్తూ పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ తగుచర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

అనంతరం సీపీ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియంత్రణ కోసం శ్రమించే ట్రాఫిక్ పోలీసులు, వారి సూచనల మేరకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. దీని ద్వారా వాహనదారులు క్షేమంగా, త్వరితగతిన గమ్యస్థానాలకు చేరుకుంటారని తెలిపారు. అనంతరం క్షేత్రస్థాయిలో ట్రాఫిక్ సమస్యలను సీపీ, కలెక్టర్, కమిషనర్ పరిశీలించారు. సమావేశంలో డీసీపీలు రవీందర్, షేక్ సలీమా, డీటీవో పుప్పాల శ్రీనివాస్, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, తిరుమల్, తిరుపతి, దేవేందర్‌రెడ్డి, నందిరాంనాయక్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

4న భగవద్గీత శ్లోక పఠనం పోటీలు

పోచమ్మమైదాన్, ఆగస్టు 1: గ్రేటర్ వరంగల్ నగరంలోని గురుధామంలో 4న భగవద్గీత శ్లోక పఠనం, అవగాహన పోటీలను నిర్వహించనున్నట్లు శివానందగురు కల్చరల్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్ తెలిపారు. పైడిపెల్లిలోని గురుధామంలో (సప్తధామ్)గురువారం ట్రస్టు ఆధ్వర్యంలో భగవద్గీత శ్లోక పఠనం పోటీల వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. గోపిచంద్ మాట్లాడుతూ సీనియర్, జూనియర్ రెండు విభాగాలుగా ఏర్పాటు చేసి భగవద్గీత శ్లోక పఠన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు 98484 23133 నెంబరు వాట్సాప్ ద్వారా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు బండారు సాయి నారాయణ, సోమ రామయ్య మాదారపు సదాశివుడు, గుండె ఉమాశంకర్ పాల్గొన్నారు.

రంగశాయిపేటను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దుతాం

శంభునిపేట, ఆగస్టు 1: రంగాశాయిపేటను విద్యా కేంద్రంగా తీర్చి దిద్దుకుంటామని రంగశాయిపేట కాలనీల డెవలప్‌మెంట్ అసోసియేషన్ (ఆర్‌సీడీఏ) అధ్యక్షుడు కర్ని రవీందర్ అన్నారు. రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బదిలీపై వెళ్తున్న ప్రిన్సిపాల్ శోభాదేవికి గురువారం అభినందన సభ ఏర్పాటు చేసి సత్కరించారు. ఇంటర్ ఫలితాల్లో కళాశాలను జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిపిన ఘనత శోభాదేవిదని కొనియాడారు. అనంతం బదిలీపై వెళ్తున్న వైస్ ప్రిన్సిపాల్ రజిత, లైబ్రేరియన్ హాలూనయక్, ఆఫీస్ సబార్డినేట్ ఉబ్బని సంగీతలను సత్కరించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త యాదాల జగపతి, అధ్యాపకులు, వీరాంజన్, మహాలక్ష్మి, రూపారాణి, మల్లారెడ్డి, అనిల్, నరేష్, లక్ష్మీ, మమత పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు పరిహారం చెల్లింపునకు చర్యలు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 1: ఇన్నర్ రింగ్‌రోడ్ భూ నిర్వాసితులకు పరిహారం చెల్లింపునకు వేగవంతంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సత్య శారద ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇన్నర్ రింగ్‌రోడ్‌కు భూములు ఇచ్చిన తిమ్మాపూర్, ఖిలావరంగల్, గొర్రెకుంట, ఏనుమాముల ప్రాంతాల రైతులకు త్వరితగతిన పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వరంగల్‌లో స్పోర్ట్స్ స్టేడియం క్రీడానగరం ఏర్పాటు చేసేందుకు నగర పరిసరాల్లో 50 నుంచి 100 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించాలని కలెక్టర్ సూచించారు. 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ వరంగల్‌లో స్పోర్ట్స్ స్టేడియం అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే నగరం పరిసర ప్రాంతాల్లో క్రీడానగర్ ఏర్పాటుకు ప్రభుత్వ భూమిని గుర్తించాలన్నారు. సమావేశంలో ఆర్డీవో కృష్ణవేణి, కుడా పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, తహసీల్దార్లు నాగేశ్వర్‌రావు, రియాజుద్దీన్, ఇక్బాల్ పాల్గొన్నారు.

మొక్కల లక్ష్యాన్ని పూర్తి చేయాలి

వీసీలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ సత్యశారద, అధికారులు

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 1 : వన మహోత్సవంలో మొక్కల లక్ష్యాన్ని పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి పచ్చదనం కార్యక్రమంపై కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం కింద గ్రామాలు, పట్టణాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాల వివరాలు, షెడ్యూల్‌ను వివరించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ మానిటరింగ్ చేయాలని, ప్రతి నెల 3వ శనివారం స్వచ్ఛదనం, పచ్చదనం రోజుగా పాటించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఎఫ్‌వో అనుజ్ అగర్వాల్, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, అధికారులు పాల్గొన్నారు.

డీఎఫ్‌వోగా శ్రీధర్ నియామకం

జిల్లా అధికారి అజయ్ ఖమ్మానికి బదిలీ

మట్టెవాడ, ఆగస్టు 1: వరంగల్ జిల్లా అగ్నిమాపక అధికారి బి.అజయ్ కుమార్‌ను ఖమ్మం జిల్లాకు బదిలీ చేస్తూ రాష్ట్ర అగ్నిమాపక డీపీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వారం రోజుల క్రితమే మంచిర్యాల నుంచి జిల్లాకు బదిలీపై వచ్చిన అజయ్ కుమార్‌ను గురువారం ఖమ్మం జిల్లాకు బదిలీ చేశారు. జిల్లా అగ్నిమాపక అధికారిగా ఎస్.శ్రీధర్‌ను నియమిస్తూ రాష్ట్ర అగ్నిమాపక శాఖ డీజీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం శ్రీధర్ హైదరాబాద్ జిల్లాలో అగ్నిమాపక అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల్లో వరంగల్ జిల్లా అగ్నిమాపక అధికారిగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

ఎరువుల షాపుల తనిఖీ



సంగెంలో ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న జేడీఏ

సంగెం, ఆగస్టు 1 : లోహిత, గాంధీ నగర్, తిమ్మాపురం, గవిచర్ల, తీగరాజుపల్లి, సంగెం గ్రామాల్లోని ఎరువుల షాపుల్లో గురువారం జిల్లా వ్యవసాయ అధికారిణి ఉషాదయాల్ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది చిన్న సన్నకారు రైతులు, మహిళా ఎస్సీ, ఎస్టీ రైతు లను ప్రాధాన్యత ఆధారంగా రైతు బీమా ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవాలని సూచించారు. రైతుల రుణమాఫీ సమస్యలు, సందేహాలు, పరిష్కార మార్గాలు రైతువేదికలలో ఏఈవో లు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆహార భద్రత మిషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కన్సల్టెంట్ పి.సారంగం, సీహెచ్ యాకయ్య పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద మృతి

ఘటనపై కుటుంబ సభ్యుల అనుమానాలు

బాలసముద్రం, ఆగస్టు 1 : హనుమకొండ నగరం నక్కలగుట్టలోని వైబ్రంట్ అకాడమీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఇనుముల భవానిరెడ్డి(15) బుధవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన ఇనుముల జనార్దన్‌రెడ్డి, సుమలత దంపతులకు కూతురు భవానిరెడ్డి, కుమారుడు రిషిరెడ్డి ఉన్నారు. జనార్దన్‌రెడ్డి కమలాపూర్‌లో మోటర్ వైండింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భవానిరెడ్డి వైబ్రంట్ అకాడమీలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతోంది. బుధవారం రాత్రి 9:30 గంటలకు భవానిరెడ్డి హాస్టల్‌లోని తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకోగా.. గమనించిన వెంటనే ఆమెను అక్కడి నుంచి వాహనంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించామని, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలపడంతో మృతదేహాన్ని వరంగల్‌లోని ఎంజీఎం మార్చురీకి తరలించినట్టు హాస్టల్ వార్డెన్ సంగీత, ఇన్‌చార్జ్ ధరణి తెలిపారు. ఇక భవానిరెడ్డి మృతి విషయంలో తమకు అనుమానాలు ఉన్నాయంటూ కుటుంబసభ్యులు, విద్యార్థిసంఘాల నాయకులు గురువారం ఉదయం వైబ్రంట్ అకాడమీవద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. కాలేజీ ఎదుట ధర్నా చేసి.. ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వారు ఆందోళన చేయగా.. సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి పోలీస్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని విద్యార్థి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అయినప్పటికీ వారు శాంతించపోవడంతో ఏసీపీ దేవేందర్‌రెడ్డి వచ్చి వారితో మాట్లాడారు. కాలేజీ యాజమాన్యం విద్యార్థిని మృతికి బాధ్యత వహించి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పడంతో గొడవ సద్దుమనిగినట్లు భవానిరెడ్డి బంధువులు, పోలీసులు తెలిపారు. కాగా మృతురాలి తండ్రి జనార్దన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

విద్యార్థిమృతికి కారణమైన కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. ఉన్నతాధికారులు వెంటనే కళాశాల వద్దకు రావాలని వారు కోరడంతో ఏసీపీ దేవేందర్ రెడ్డి డీఈవోతో ఫోన్‌లో మాట్లాడించారు. కళాశాలకు అనుమతులు లేవని డీఈవో వారికి తెలపడంతో వారు మరింత ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా నడిపిస్తున్న వైబ్రంట్ అకాడమీని తక్షణం మూసేసి చైర్మన్ రాజేందర్‌రెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన భవానిరెడ్డి కుటుంబానికి యాజమాన్యమే రూ.50లక్షలు చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధానకార్యదర్శి భాషబోయిన సంతోష్ డిమాండ్ చేశారు.

ఈ ఆందోళనలో తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజేందర్, తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కో ఆర్డినేటర్ అజ్మీరా వెంకట్ నాయక్, ధర్మ స్టూడెంట్ యూనియన్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి పూరెల్ల విష్ణు పాల్గొన్నారు.

కోచ్ తూచ్!

(5వ పేజీ తరువాయి)

ప్రైవేట్ భాగస్వామ్యంతో కాజీపేటలో వ్యాగన్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు రూ.15కోట్లు మంజూరు చేశారు. దీనికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 54ఎకరాల భూమిని కూడా కేటాయించినా.. ఆ భూమిపై వివాదాలు రావటంతో ఆ ప్రాజెక్టు వెనక్కు వెళ్లింది. అయితే తెలంగాణ ఏర్పడిన తరువాత విభజన చట్టంలో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై కేంద్రం హామీ ఇచ్చినా అది నెరవేరలేదు.

వ్యాగన్‌తో ఒనగూరేది అంతంతే..

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ కోసం జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఏర్పాటు చేసిన వ్యాగన్ పరిశ్రమతో ఒనగూరేది ఏమిటనే ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తం అవుతున్నాయి. తాము డిమాండ్ చేస్తున్న కోచ్ ఫ్యాక్టరీకి కొర్రీలు పెట్టి.. కేంద్ర ప్రభుత్వం వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంటున్నారని విమర్శిస్తున్నారు. కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే సుమారు 60వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని, వ్యాగన్ ద్వారా కేవలం 2వేల మందికి కూడా ఉపాధి లభించే అవకాశాలు లేవని స్థానికులు పేర్కొంటున్నారు. వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేసినా కోచ్‌ఫ్యాక్టరీ కూడా కాజీపేటలో ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఇటీవల కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి జరిపిన చర్చల్లో తెలంగాణకు ఇచ్చిన విభజన హామీల్లోని కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేయాలని కోరారు. అయితే ఇటీవల ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ప్రస్తావన లేదు. కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ వస్తే మరి కొన్ని రైల్వే సంబంధిత భారీ పరిశ్రమలు కూడా వచ్చే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

కలగానే రైల్వే డివిజన్..

దక్షిణ భారతదేశ రైల్వేకు గేట్‌వేగా ఉన్న కాజీపేటను డివిజన్‌గా ఏర్పాటు చేయాలనే డిమాండ్ తెరపైకి బలంగా వచ్చింది. కాజీపేట మీదుగా సెంట్రల్ ఇండియా, నార్త్ ఇండియాకు రైళ్లు నడుస్తున్నాయి. కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ మీదుగా నిత్యం సుమారు 200లకు పైగా గూడ్స్, ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. వీటితో పాటు భూపాలపల్లి, రామగుండం, గోదావరిఖని, మణుగూరు, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో ఉన్న బొగ్గు రవాణా కాజీపేట రైల్వే స్టేషన్ మీదుగానే జరుగుతుంది. ఎక్కువ ఆదాయం వచ్చే జంక్షన్లలో కాజీపేట ప్రథమ స్థానంలో నిలుస్తుంది. ఇక కాజీపేటకు అతి సమీపంలో సికింద్రాబాద్ డివిజన్ ఉండటం మూలంగానే కాజీపేటకు డివిజన్ ఇవ్వటం కుదరటం లేదని కేంద్ర చెప్పుతుందని, అయితే విజయవాడకు కేవలం 30కిలోమీటర్ల దూరంలోనే ఉన్న గుంటూరును డివిజన్ చేసినప్పుడు హైదరాబాద్-సికింద్రాబాద్‌కు 128కిలో మీటర్లకు పైగా ఉన్న కాజీపేటను డివిజన్ చేయటంలో అభ్యంతరం ఎందుకనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రైల్వే విడిజన్ ఏర్పడితే పరిపాలన సౌలభ్యంతోపాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయని రైల్వే ఉద్యోగులు అభిప్రాయ పడుతున్నారు.

తూతూ మంత్రంగా దేవాదాయ శాఖలో బదిలీలు

వరంగల్ కల్చరల్, ఆగస్టు 1: ఉమ్మడి వరంగల్ జిల్లాలో దేవాదాయ శాఖలో ఉద్యోగుల బదిలీలు తూతూ మంత్రంగా సాగాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెద్ద ఎత్తున బదిలీలు జరుగుతాయని ప్రచారం జరిగిన నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన అధికారులు హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి పరుగులు పెట్టారు. జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖ దేవాదాయ శాఖ మంత్రి కావడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్ద ఎత్తున బదిలీలు జరుగుతాయని వార్తలు వచ్చాయి. కానీ జూలై 31 వరకు అందరూ ఊహించినట్లుగా కాకుండా 5వ జోన్ భద్రాద్రి జోన్‌కు సంబంధించిన దేవాదాయ శాఖ వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన కొద్దిమంది బదిలీలు మాత్రమే జరిగాయి. మిగతా డిప్యూటీ కమిషనర్ స్థాయి నుంచి అటెండర్ స్థాయి వరకు ఎవరి స్థానంలో వారు ఉండడం కొసమెరుపు.

బదిలీ అయిన సిబ్బంది వీరే..

వరంగల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయ సూపరింటెండెంట్ వీరస్వామిని ఖమ్మం సహాయ కమిషనర్ కార్యాలయం సూపరిం టెండెంట్‌గా బదిలీ అయ్యారు. ఖమ్మంలో విధులు నిర్వహి స్తున్న గౌరీ శంకర్‌ను వరంగల్ డీసీ కార్యాలయానికి బదిలీ చేశారు. వరంగల్ ఏసీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్‌ను ఖమ్మం డివిజన్ ఇన్‌స్పెక్టర్‌గా, ఖమ్మం డివిజన్ ఇన్‌స్పెక్టర్ సమతను వరంగల్ డీసీ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. వరంగల్ డీసీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సౌజ న్యను వరంగల్ ఏసీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. అలాగే గీసుగొండ మండలం కొమ్మాల ఈవో శేషగిరిరావును ఖమ్మం సిగుల్‌పూర్ శివాలయానికి ఈవోగా బదిలీ చేశారు.

ఎర్రగట్టుగుట్ట వేంకటేశ్వర ఆలయం ఈవోగా ఉన్న బి.కిషన్‌రావును వరంగల్ స్టేషన్ రోడ్డులోని కాశీ విశ్వేశ్వరాలయం(ఆకారపు వారి గుడి)కి బదిలీ చేశారు. వరంగల్ రామలింగేశ్వరాలయం ఈవో వెంకట్రావును ఎర్రగట్టు గుట్ట ఈవోగా బదిలీ చేశారు. మల్లూరు లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం ఈవో సత్యనారాయణను మహదేవ్‌పూర్‌లోని వేంకటేశ్వరాలయానికి బదిలీ చేశారు. చిలుపూరు గుట్ట ఈవో లక్ష్మిప్రసన్నను నవాబుపేటలోని కోదండరామాలయంకు ఈవోగా బదిలీ చేశారు.

మాజీ సర్పంచ్‌కు కొండా పరామర్శ

గీసుగొండ, ఆగస్టు 1: గీసుగొండ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు రడం భరత్ తల్లి రడం వినోదకు ఇటీవల కాలుకు శస్త్రచికిత్స జరగగా, గురువారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఆమె స్వగ్రామం రాంపురంలో పరామర్శించారు. మాజీ వైస్ ఎంపీపీ రడం శ్రావ్యభరత్, మాజీ ఎంపీటీసీ వీరారావు, మాజీ సర్పంచ్ గాజర్ల గోపి, మాజీ ఉపసర్పంచ్ దర్శనాల కుమారస్వామి, సింగరి రాజ్‌కుమార్, గాజర్ల రవి, దర్శనాల రాజు, తాబేటి వీరస్వామి పాల్గొన్నారు.

కాట్రపల్లిలో ఇటలీ దేశస్థులు

సంగెం, ఆగస్టు 1 : కాట్రపల్లిలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వేసిన చేతిపంపును గురువారం ఇటలీ దేశస్థులు ప్రారంభించారు. భారత్ పర్యటనకు వచ్చిన వారిని బాలవికాస సంస్థ మండలానికి తీసుకువచ్చింది. ఈ సందర్భంగా గ్రామంలో తిరుగుతూ పల్లె స్థితిగతులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో క్యాథెలిక్ యూనివర్సిటీ ఆఫ్ మిలియన్ నుండి వచ్చిన ఇటలీ దేశస్థులు లెటిజియా ఫాంటినీ, కెసిల్లా ఫాట్టర్, అమాన్యుల్ హబ్టెమెరియమ్ టెఫాయ్, మాజీ ఎంపీటీసీ సొల్లేటి మాధవరెడ్డి, రాజేందర్‌రెడ్డి, ప్రోగ్రాం మేనేజర్ మధుసూదన్ రెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

చైన్‌స్నాచర్ల కోసం గాలింపు

మట్టెవాడ, ఆగస్టు 1: నగరంలో మంగళవారం రాత్రి రెండు చోట్ల చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన చైన్‌స్నాచర్ల కోసం గాలింపు ముమ్మరం చేశారు. వరంగల్ చౌరస్తా, కొత్తవాడ ప్రాంతాల్లో రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో చైన్‌స్నాచింగ్‌లు జరిగిన విషయం తెలిసిందే. కొత్తవాడ చైన్‌స్నాచింగ్‌కు ఆక్టీవా హోండాపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు అక్కడ ఘటన జరిగిన తర్వాత రెండు గంటల తర్వాత మేదరివాడకు వచ్చిన గ్యాంగ్ ఒకటేనా అన్న కోణంలో విచారిస్తున్నారు.

రంగంలోకి ప్రత్యేక టీంలు..

నిందితులను పట్టుకునేందుకు సీసీఎస్, మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ముగ్గురు ఇన్‌స్పెక్టర్లతోపాటు, సీసీఎస్‌కు చెందిన నాలుగు ప్రత్యేక బృందాలు మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్ పోలీసులు నగరంలో గాలింపులు చేపడుతున్నారు. సీసీ ఫుటేజీలను జల్లెడ పడుతున్నారు. పాత నేరస్తుల కదలికలపై కూడా దృష్టి సారించారు. ఇతర జిల్లాల పోలీస్ అధికారులకు వరంగల్ నగరంలో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడ్డ అనుమానితులను ఫోటోలను షేర్ చేస్తున్నారు. కొత్తవాడ, మేదరవాడలో మేదరివాడలో చీకటిగా ఉన్న ప్రాంతంలోనే స్నాచింగ్‌కు పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు.

మంద కృష్ణను కలిసిన కొండేటి

మిల్స్‌కాలనీ ఆగస్టు 1: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాది గను బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం ఢిల్లీలో కృష్ణమాదిగను కలిసి శాలువాతో సత్కరించా రు. ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేసిన కృష్ణ మాదిగను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు.

కోటలో వనభోజనాల సందడి

ఖిలావరంగల్, ఆగస్టు 1: ఆషాఢ మాసం ముస్తుండడంతో వనభోజనాలకు వచ్చిన వారితో కోట ప్రాంతం గురువారం సందడి సందడిగా మారింది. ఖిలా వరంగల్, ఖమ్మంరోడ్, వరంగల్ తదితర ప్రాంతాలకు చెందిన కుటుంబ సభ్యులు, ఉదయం నుంచి ఖిలావరంగల్ శివారు ప్రాంతమైన కుమ్మరికుంట, మధ్యకోట వాకింగ్ గ్రౌండ్ రాతి కోట, తదితర ప్రాంతాలకు వచ్చారు. కుటుంబసభ్యులతో ఆహ్లాదంగా గడిపారు. ముందుగా స్థానిక కనకదుర్గామాత దేవాలయానికి వెళ్లి మొక్కులు చెల్లిం చుకున్నారు. విందుభోజనాలు ఆరగించారు.

మహిళా సంఘాల పనితీరు బాగుంది

సంగెం, ఆగస్టు 1: గ్రామాల్లో మహిళా సంఘాల పనితీరు బాగుందని సెంట్రల్ సెక్రటేరియట్ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల బృందం హర్షం వ్యక్తం చేశారు. గురువారం తీగరాజుపల్లిలో పర్యటించిన సెంట్రల్ టీం సంఘాల పనితీరు, సబ్ కమిటీల పనితీరు, పుస్తక నిర్వహణ, పొదుపు, రుణం పొందే విధానం, తిరిగి చెల్లింపు పద్ధతులు, బ్యాంకు రుణాలు, ఆటో మొబైల్, మైక్రోరుణాలు, పుస్తక నిర్వహణ తీరు తెన్నులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సెంట్రల్ టీం సభ్యులు అహ్మద్, ఉమేష్ పాల్, పంకజ్, తుషార్, ఆశిష్ కంబోజ్, ఏపీఎం కిషన్, అశోక్, పరమాత్మ, నర్సింహస్వామి, కార్యదర్శి మమత, లావణ్యపాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవం

వరంగల్ సిటీ, ఆగస్టు 1: పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టించాలని 14వ డివిజన్ కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య సూచించారు. గురువారం 14వ డివిజన్ ఎన్‌టీఆర్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో సూపర్‌వైజర్ జక్కుల లావణ్య ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్ కె.శోభారాణి అధ్యక్షతన తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్ల బలోపేతం కోసం ప్రయత్నిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం టి.స్వప్న, హెచ్ఎం. ఎన్. ప్రవీణ్, అంగన్‌వాడీ టీచర్లు యశోద, మణి, రత్నశ్రీ, లత, పున్నమ్మ, వసంత, భువనేశ్వరి పాల్గొన్నారు.

శ్రమతోనే పాట పుట్టింది

ప్రజానాట్య మండలి జిల్లా బాధ్యుడు రమేష్

ఖిలావరంగల్, ఆగస్టు 1: శ్రమతోనే పాట పుట్టిందని, అలా మొదలైన పాట, యక్షగానమై, సింధు బాగోతమై, ఒగ్గు కథ, గొల్లసుద్దులు, జములుకుల కథ తదితర రూపాలుగా మారి రాష్ట్రస్థాయి ప్రజాకళలల పండుగగా మారిందని తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా నిర్మాణ బాధ్యుడు గన్నారపు రమేష్ అన్నారు. గురువారం శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో బత్తుల సుప్రియ అధ్యక్షతన ప్రజానాట్యమండలి జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి రమేష్ మాట్లాడతూ రాష్ట్రస్థాయి ప్రజాకలల పండుగ కళాకారులం కలుద్దాం, సమగ్ర సాంస్కృతిక విధానాన్ని కోరుదాం అన్నారు. తెలంగాణలో నిజాంకు వ్యతిరేకంగా గ్రామీణ ప్రాంతంలో ప్రజలను ఒక్కతాటి మీద నడిపించి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొనేలా చేసిందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దామెర కృష్ణ మాట్లాడుతూ జానపద, గిరిజన సంప్రదాయక నృత్యాలతో విభిన్న కళారూపాలతో పరిపూర్ణత చెందిన కళగా, ప్రజల కోసం 1943 మే 25న, ముంబాయిలో ఆవిర్భవించిందన్నారు. దీనినే ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్(ఐపీటీఏ) ఇప్పాగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్డీ ముస్నీ, కడమంచి యాదగిరి, అమ్మడాల సుమలత, బొమ్మకంటి స్వప్న, జాడి సుకన్య కొ య్యడ మనోహర్ పాల్గొన్నారు.

రమేష్‌కు ఘన సన్మానం

గీసుగొండ, ఆగస్టు 1 : గీసుగొండ వెటర్నరీ డాక్టర్‌గా పనిచేసి ములుగు జిల్లా మల్లంపల్లికి బదిలీ అయిన వడ్డేపల్లి రమేష్‌ను గొర్రెలకాపర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, ఆగస్టు 1: మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 19 మంది వాహనదారులకు గురువారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ 19 మందికి రూ.24వేల జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన వాహనదారునికి రూ.1,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

బీసీ హాస్టల్‌లో వైద్యశిబిరం

గీసుగొండ, ఆగస్టు 1: సీజనల్ వ్యాధుల దృష్ట్యా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గీసుగొండ బీసీ బాలుర హాస్టల్‌లో గురువారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 54మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు, 6 గురికి రక్తపరీక్షలు నిర్వహించినట్లు సీహెచ్‌వో మధుసూదన్‌రెడ్డి తెలిపారు. హాస్టల్ వార్డెన్ అర్జున్, సూపర్‌వైజర్ పద్మావతి, ఏఎన్ఎం స్వరూప, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా తీజ్ వేడుకలు



తీజ్‌లతో ఆలయానికి వెళుతున్న గిరిజన మహిళలు

గీసుగొండ, ఆగస్టు 1: మండలంలోని విశ్వనాథపురంలో గిరిజనుల తీజ్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు భక్తిశ్రద్ధలతో తీజ్‌లను ఎత్తుకొని ఆలయానికి వెళ్లి మొక్కులు సమర్పించుకున్నారు. సంఘ నాయకులు తిరుపతినాయక్ మాట్లాడుతూ గిరిజన వైభవానికి, సాంస్కృతికి తీజ్ వేడుకన్నారు. శ్రావణమాసంలో వ్యవసాయ పనులు పూర్తి చేసుకున్న తర్వాత 9 రోజుల పాటు తీజ్(బతుకమ్మ) వేడుకలను నిర్వహించుకోవటం గిరిజనులు ఆచారంగా వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, రవి, రాజు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL శుక్రవారం 2 ఆగస్టు 2024

వరంగల్ రూరల్

వన మహోత్సవ లక్ష్యాన్ని పూర్తి చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 1 : వన మహోత్సవంలో మొక్కల లక్ష్యాన్ని పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి పచ్చదనం కార్యక్రమంపై కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం కింద గ్రామాలు, పట్టణాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాల వివరాలు, షెడ్యూల్‌ను వివరించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ మానిటరింగ్ చేయాలని, ప్రతి నెల 3వ శనివారం స్వచ్ఛదనం, పచ్చదనం రోజుగా పాటించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఎఫ్‌ఓ అనుజ్ అగర్వాల్, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, అధికారులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



నర్సంపేటలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నర్సంపేట, ఆగస్టు 1 : అసెంబ్లీ సమావేశాల్లో మాజీ మహిళా మంత్రులు సబిత ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిలపై రాష్ట్రముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాయిడి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిలో మహిళలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. కనీసం సోయి లేకుండా ఆడబిడ్డలను నమ్ముకుంటే ఆగమై పోతాం, ఆడ బిడ్డలను నమ్ముకుంటే ముంచుతారంటూ, జీవితం బస్టాండ్ పాలవుతుందంటూ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం ఆయన స్థాయికి తగిందికాదన్నారు. సబిత ఇంద్రారెడ్డి, సునీతలక్ష్మారెడ్డిలతో పాటు తెలంగాణ ఆడబిడ్డలకు సీఎం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకట నారాయణగౌడ్, కౌన్సిలర్లు దేవోజు తిరుమల, సదానందం, బానాల ఇందిరరాంబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌టియూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్, కొల్లూరి లక్ష్మినారాయణ, పెండ్యాల యాదగిరి, ప్రవీణ్, నాయిని వేణు. గందె చంద్రమౌళి. పెండెం వెంకటేశ్వర్లు, తోట సుదర్శన్. రాజు, కరుణాకర్, పెరుమాండ్ల రవి పాల్గొన్నారు.

- వర్ధన్నపేట : బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డిని ఉద్దేశిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ధర్నా చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి అన్నమనేని అప్పారావు, మాజీ జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, మున్సిపల్ వైస్ చైర్మన్ కోమాండ్ల ఎలేందర్‌రెడ్డి, కౌన్సిలర్‌లు తోటకూరి రాజమణి, బానోత్ అనితశ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు సంపత్‌రెడ్డి, ఆత్మచైర్మన్ గుజ్జ గోపాల్‌రావు, కర్రవెంకట్‌రెడ్డి, పెంచాల కుమారస్వామి, వేణుగోపాల్‌రావు, డాక్టర్ కొండేటి శ్రీను, తిరుపతి సురేష్, ఎల్లస్వామి, గోధుమల మధు, తోటకూరి శ్రీధర్, అయిత ఎల్లయ్య, కొండేటి సంపత్, కొండేటి భాస్కర్, నాగార్జున, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- రాయపర్తి : బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై మండల బీఆర్ఎస్ నాయకులు ఆందోళన నిర్వహించారు. నల్లా బ్యాడ్జీలు ధరించి రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ నయీం, ఆకుల సురేందర్‌రావు, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, కోదాటి దయాకర్‌రావు, భద్రు నాయక్, రంగయ్య, వెంకన్న, రాజు, యాదగిరి, మధు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య

నల్లబెల్లి, ఆగస్టు 1 : మండగలంలోని నారక్కపేటలో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... ఓదెల సదయ్య(50) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అనారోగ్యం, అప్పుల బాధతో గురువారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి పడుకున్నాడు. తన భార్య అన్నం తిందువులే అని దగ్గరకు వెళ్లి పిలిచేసరికి పురుగుల మందు వాసన వచ్చింది. దీంతో హుటాహుటిన నర్సంపేట ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కుటుంబ నియంత్రణ క్యాంపుల ఊసేదీ?

దృష్టి సారించని జిల్లా వైద్యాధికారులు

సొమ్ము చేసుకుంటున్న ప్రైవేటు ఆస్పత్రులు

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 1: కొన్ని నెలలుగా కుటుంబ నియంత్రణ క్యాంపుల ఊసే కనిపించడంలేదు. ఆ మధ్య కాలంలో పీహెచ్‌సీల్లో ఎక్కువగా కుటుంబ నియంత్రణ క్యాంపులు జరిగేవి. వాటిపై ముందుగానే వైద్యులు, వారి బృందం ప్రకటనలు ఇచ్చి ప్రజలను చైతన్యవంతులని చేసేవారు. ఈ మధ్య కాలంలో జిల్లా వైద్యాధికారులు దృష్టి సారించకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని చెపుతూ ముందుకు వెళ్తోంది. ఇదే తరుణంలో కుటుంబ నియంత్రణపై సైతం అవగాహన కల్పిస్తూ క్యాపులు ఏర్పాటు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లి ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆపరేషన్లు చేయించుకుని పేదలు జేబులు గుళ్ల చేసుకుంటున్నారు.



దృష్టి సారించని వైద్యాధికారులు

ఇద్దరు సంతానం కలిగిన తర్వాత ఆపరేషన్ చేయించుకుందామని వెళ్తే ప్రభుత్వ ఆస్పత్రుల్లోని వైద్యులు రక్తం లేదనో, ఆరోగ్యం బాగా లేదనో సాకుచెప్పి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో చేసేదిలేక పట్టణాల్లో, స్థానికంగా పేరుమోసిన ప్రైవేటు ఆస్పత్రుల్లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసుకుం టున్నారు. కుటుంబ నియంత్రణపై ప్రభుత్వం నిబద్ధతతో పనిచేయాల్సి ఉండగా, ఆ దిశగా అడుగులు పడడం లేదు. రెండోసారి కాన్పు జరిగినప్పుడు ప్రైవేటు ఆస్పత్రుల్లో పిల్లలు కాకుండా ఆపరేషన్లు చేస్తున్నారని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేయడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో ప్రతి నెలలో ఒకసారి కుటుంబ నియంత్రణ క్యాంపులు ఏర్పాటు చేసేవారు. వర్ధన్నపేట సీహెచ్‌సీ లేదా, రాయపర్తి పీహెచ్‌సీల్లో ఎక్కువగాజరిగేవి. ఇప్పుడు వాటి ఊసే కనిపించడంలేదు. దీనికి తోడు ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కొందరు ప్రైవేటు క్లినిక్ డాక్టర్లు బాధితుల బాధను ఆసరాగా చేసుకుని వారి ఆస్పత్రుల్లో తక్కువ రేటుకే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తామని చెప్పి రోగులను తరలించుకుపోతున్నట్లు తెలుస్తోంది.

వెసెక్టమీ పై మగవారిలో ఆందోళన

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఆడ, మగ ఇద్దరిలో ఎవరైనా చేసుకునే అవకాశం ఉంది. మగవారికి చేస్తే వెసెక్టమీ అని, ఆడవారికి చేస్తే ట్యుబెక్టమీ అని సంబోధిస్తారు. అయితే వెసెక్టమీపై మగవారిలో ఎన్నో అనుమానాలు, భయాలు ఉన్నాయి. దీంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు ఎక్కువగా ఆసక్తి చూపడం లేదు. ఆడవారు చేసుకుందామంటే వైద్యులు కొర్రీలు పెట్టడంతో ఇప్పటికే ఇద్దరు పిల్లల సంతానం ఉన్నవారు తలలు పట్టుకుంటున్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లపై క్షేత్రస్థాయిలో ప్రజలు అవగాహన కల్పించడంలో సైతం వైద్యులు విఫలమవుతున్నారు. స్థానిక ఏఎన్ఎంలు, ఆశాల ద్వారా వారికి ఆపరేషన్లపై భయాలను పోగొడితే ఇబ్బందులు లేకుండా ఉండేవి. వెసెక్టమీ చేసుకున్న వారికి రూ.1,100లు, ట్యుబెక్టమీ చేసుకున్న వారికి రూ.800వరకు నగదు బహుమతిగా సైతం అందించేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

ఉన్నతాధికారులకు తెలియజేస్తాం

డాక్టర్ నర్సింహస్వామి, సీహెచ్‌సీ, సూపరింటెండెంట్



కుటుంబ నియంత్రణ క్యాంపలపై జిల్లా ఉన్నతాధికా రులకు నివేదిస్తాం. క్యాంపుల నిర్వహణ పై ప్రభుత్వ ఆదేశాలు ప్రత్యేకం గాలేవు. డీఎంహెచ్‌వో పరిధిలోని అంశం. మామూలుగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు కావాలంటే ప్రభుత్వ ఆస్పత్రిలో చేస్తున్నాం.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు చరిత్రాత్మకం

నర్సంపేట, ఆగస్టు 1 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టుఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రణయదీప్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, ఎంఎస్‌పీ నాయకుడు తడుగుల విజయ్‌కుమార్, ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్ధు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగ నోటిఫికేషన్‌తోనే అనడం హర్షదాయకమని అన్నారు.కార్యక్రమంలో నారాయణ జాంబో, వేల్పుగొండ రాజు. కోట డెవిడ్, కొడారి రవి. బొట్ల పవన్, వినయ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

- వర్ధన్నపేట : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు న్యాయ సమ్మతమైనదేనని వర్ధన్నపేట కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు, జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘా నేతలు కంజర్ల మహేష్, దుబ్బ యాకయ్య, జనగాం చంద్రమౌళి, ఎమ్మార్పీఎస్ నేతలు వీరెల్లి శ్రీనివాస్, ఎర్ర శ్రీకాంత్, చింత బాబు, నంది భాస్కర్, చింత ఆనందరాజు, చెన్నపెల్లి బాబు, దుబ్బ ఎల్లయ్య, బొక్కల భాస్కర్, దుబ్బ అంజయ్య, డెక్క యాకయ్య, క్రాంతి కుమార్, బరిగెల బాబ్రి మాదిగ పాల్గొన్నారు.



మంద కృష్ణ మాదిగను సత్కరించిన మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పురస్కరించుకొని ఢిల్లీలో గురువారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగను వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఆయన వెంట బీజేపీ శ్రేణులు కాంచన కృష్ణ, కాసిపేట శివాజీ తదితరులు ఉన్నారు.

- నల్లబెల్లి : మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకంచేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బొట్ల ప్రతాప్, బొట్ల నరేష్‌లు మాట్లాడగా, ఎమ్మార్పీఎస్ నాయకులు దయాకర్, సాంబయ్య, ఇంద్రసేన, సుధాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.
- పర్వతగిరి: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు సంతోషకరమని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి మాసాని గోపాల్ అన్నారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ధర్మయ్య, భాస్కర్, నర్సయ్య, స్వామి, శ్రీనివాస్, అనిల్, రమేష్, కుమార్, శ్రీకాంత్, ముత్తయ్య, మధు, కిట్టయ్య బాబు పాల్గొన్నారు.
- రాయపర్తి : మండల కేంద్రలంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ కార్యదర్శి ఐత రాజు మాట్లాడగా, కందికట్ల విజయ్, వశపాక కుమాంర్, కంతుల జంపి, సాంబయ్య, రమేష్, శ్రీనివాస్, నగేష్, యాకమ్మ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

రాయపర్తి, ఆగస్టు 1 : లారీ ఢీ కొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కిష్టా పురం క్రాస్ రోడ్డు వద్ద గురు వారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మొరిపిరాల గ్రామానికి చెందిన బుర్ర రాజిరెడ్డి (55) తన వ్యవసాయ పొలంలో పనులు ముగించుకుని పశువులను తీసుకుని కిష్టాపురం క్రాస్ వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై వెళ్తుండగా తొర్రూరు నుంచి వరంగల్ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

డీఎఫ్‌వోగా శ్రీధర్ నియామకం

- జిల్లా అధికారి అజయ్ ఖమ్మం బదిలీ

మట్టెవాడ, ఆగస్టు 1: వరంగల్ జిల్లా అగ్ని మాపక అధికారి బి.అజయ్ కుమార్‌ను ఖమ్మం జిల్లాకు బదిలీ చేస్తూ రాష్ట్ర అగ్నిమాపక డీపీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వారం రోజుల క్రితమే మంచిర్యాల నుంచి జిల్లాకు బదిలీపై వచ్చిన అజయ్‌కుమార్‌ను గురువారం ఖమ్మం జిల్లాకు బదిలీ చేశారు. జిల్లా అగ్నిమాపక అధికారిగా ఎస్. శ్రీధర్‌ను నియమిస్తూ రాష్ట్ర అగ్నిమాపక శాఖ డీజీ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం శ్రీధర్ హైదరాబాద్ జిల్లాలో అగ్నిమా పక అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల్లో వరంగల్ జిల్లా అగ్నిమా పక అధికారిగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

నల్లబెల్లం వాహనం పట్టివేత

పర్వతగిరి, ఆగస్టు 1 : మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో అక్రమంగా గుడుంబా తయారుచేసే నల్లబెల్లాన్ని, పటికను తరలిస్తున్న వాహనాన్ని గురువారం పోలీసులు పట్టుకున్నారు. గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా వాహనం అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీలు చేయగా అందులో క్వింటా నల్లబెల్లం, 3.5 కేజీల పటికను తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనంలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తులు పారిపోయారు. వెంటనే వాహనాన్ని సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సంబంధిత వాహనంపై కేసు నమోదు చేశామని, దీని విలువ రూ.60,500 ఉంటుందని, త్వరలోనే పారిపోయిన వారిని పట్టుకుంటామని పర్వతగిరి ఎస్‌ఐ వెంకన్న వివరించారు.

ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద మృతి

బాలసముద్రం, ఆగస్టు 1 : హనుమకొండ నగరం నక్కలగుట్టలోని వైబ్రంట్ అకాడమీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఇనుముల భవానిరెడ్డి (15) బుధవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. వివరాల్లోకి వెళితే.. ములుగు జిల్లా మంగపేట మం డలం కమలాపూర్ గ్రామానికి చెందిన ఇనుముల జనార్దన్ రెడ్డి, సుమలత దంపతులకు కూతురు భవానిరెడ్డి, కుమారుడు రిషిరెడ్డి ఉన్నారు. జనార్దన్‌రెడ్డి కమలాపూర్‌లో మోటర్ వైండింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భవానిరెడ్డి వైబ్రంట్ అకాడమీలో ఇంటర్ ఎంపీ సీ మొదటి సంవత్సరం చదువుతోంది. బుధవారం రాత్రి 9.30 గంటలకు భవానిరెడ్డి హాస్టల్‌లోని తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకోగా.. గమనించిన వెంటనే ఆమెను అక్కడి నుం చి వాహనంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించామని, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలపడంతో మృతదేహాన్ని వరంగల్‌లోని ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు హాస్టల్ వార్డెన్ సంగీత, ఇన్‌చార్జ్ ధరణి తెలిపారు. ఇక భవానిరెడ్డి మృతి విషయంలో తమకు అనుమానాలు ఉన్నాయంటూ కుటుంబసభ్యులు, విద్యార్థిసంఘాల నాయకులు గురువారం ఉదయం వైబ్రంట్ అకాడమీ వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. కాలేజీ ఎదుట ధర్నా చేసి, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వారు ఆందోళన చేయగా.. సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి పోలీస్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని విద్యార్థి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అయినప్పటికీ వారు శాంతించపోవడంతో ఏసీపీ దేవేందర్‌రెడ్డి వచ్చి వారితో మాట్లాడారు. కాలేజీ యాజమాన్యం విద్యార్థిని మృతికి బాధ్యతవహించి బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పడంతో గొడవ సద్దుమనిగినట్లు భవానిరెడ్డి బంధువులు,పోలీసులు తెలిపారు. కాగా, మృతురాలి తండ్రి జనార్దన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

విద్యార్థి మృతికి కారణమైన కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. ఉన్నతాధికారులు వెంటనే కళాశాల వద్దకు రావాలని వారు కోరడంతో ఏసీపీ దేవేందర్‌రెడ్డి డీఐఈవోతో ఫోన్‌లో మాట్లాడించారు. కళాశాలకు అనుమతులులేవని డీఐఈవో వారికి తెలపడంతో వారు మరింత ఆగ్రహావేశాలు వ్యక్తంచేశారు. అనుమతి లేకుండా నడిపిస్తున్న వైబ్రంట్ అకాడమీని తక్షణం మూసేసి చైర్మన్ రాజేందర్‌రెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన భవానిరెడ్డి కుటుంబానికి యాజమాన్యమే రూ.50లక్షలు చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్ డిమాండ్ చేశారు. ఆందోళనలో తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజేందర్, తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కోఆర్డినేటర్ అజ్మీరా వెంకట్ నాయక్, ధర్మ స్టూడెంట్ యూనియన్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి పూరెల్ల విష్ణు పాల్గొన్నారు.

కోచ్ తూచ్!

(5వ పేజీ తరువాయి)

ప్రైవేట్ భాగస్వామ్యంతో కాజీపేటలో వ్యాగన్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు రూ.15కోట్లు మంజూరు చేశారు. దీనికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 54ఎకరాల భూమిని కూడా కేటాయించినా.. ఆ భూమిపై వివాదాలు రావటంతో ఆ ప్రాజెక్టు వెనక్కు వెళ్లింది. అయితే తెలంగాణ ఏర్పడిన తరువాత విభజన చట్టంలో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై కేంద్రం హామీ ఇచ్చినా అది నెరవేరలేదు.

వ్యాగన్‌తో ఒనగూరేది అంతంతే..

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ కోసం జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఏర్పాటు చేసిన వ్యాగన్ పరిశ్రమతో ఒనగూరేది ఏమిటనే ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తం అవుతున్నాయి. తాము డిమాండ్ చేస్తున్న కోచ్ ఫ్యాక్టరీకి కొర్రీలు పెట్టి.. కేంద్ర ప్రభుత్వం వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంటున్నారని విమర్శిస్తున్నారు. కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే సుమారు 60వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని, వ్యాగన్ ద్వారా కేవలం 2వేల మందికి కూడా ఉపాధి లభించే అవకాశాలు లేవని స్థానికులు పేర్కొంటున్నారు. వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేసినా కోచ్‌ఫ్యాక్టరీ కూడా కాజీపేటలో ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఇటీవల కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి జరిపిన చర్చల్లో తెలంగాణకు ఇచ్చిన విభజన హామీల్లోని కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేయాలని కోరారు. అయితే ఇటీవల ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ప్రస్తావన లేదు. కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ వస్తే మరి కొన్ని రైల్వే సంబంధిత భారీ పరిశ్రమలు కూడా వచ్చే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

కలగానే రైల్వే డివిజన్..

దక్షిణ భారతదేశ రైల్వేకు గేట్‌వేగా ఉన్న కాజీపేటను డివిజన్‌గా ఏర్పాటు చేయాలనే డిమాండ్ తెరపైకి బలంగా వచ్చింది. కాజీపేట మీదుగా సెంట్రల్ ఇండియా, నార్త్ ఇండియాకు రైళ్లు నడుస్తున్నాయి. కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ మీదుగా నిత్యం సుమారు 200లకు పైగా గూడ్స్, ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. వీటితో పాటు భూపాలపల్లి, రామగుండం, గోదావరిఖని, మణుగూరు, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో ఉన్న బొగ్గు రవాణా కాజీపేట రైల్వే స్టేషన్ మీదుగానే జరుగుతుంది. ఎక్కువ ఆదాయం వచ్చే జంక్షన్లలో కాజీపేట ప్రథమ స్థానంలో నిలుస్తుంది. ఇక కాజీపేటకు అతి సమీపంలో సికింద్రాబాద్ డివిజన్ ఉండటం మూలంగానే కాజీపేటకు డివిజన్ ఇవ్వటం కుదరటం లేదని కేంద్ర చెప్పుతుందని, అయితే విజయవాడకు కేవలం 30కిలో మీటర్ల దూరంలోనే ఉన్న గుంటూరును డివిజన్ చేసినప్పుడు హైదరాబాద్-సికింద్రాబాద్‌కు 128కిలో మీటర్లకు పైగా ఉన్న కాజీపేటను డివిజన్ చేయటంలో అభ్యంతరం ఎందుకనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రైల్వే విడిజన్ ఏర్పడితే పరిపాల సౌలభ్యంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయని రైల్వే ఉద్యోగులు అభిప్రాయ పడుతున్నారు.

'డ్రైవర్లు మద్యానికి దూరంగా ఉండాలి'

నెక్కొండ, ఆగస్టు 1 : మద్యం అలవాటు డ్రైవర్ల కుటుంబాలకు శత్రువు లాంటిందనే విషయాన్ని డ్రైవర్లు గుర్తించి మద్యంకు దూరంగా ఉండాలని నెక్కొండ సీఐ చంద్రమోహన్ అన్నారు. ప్రపంచ ఆటో కార్మికుల దినోత్సవం సందర్భంగా గురువారం నెక్కొండలో 300 వందల ఆటోలతో భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన అనంతరం సీఐ మాట్లాడుతూ అనేక ప్రమాదాలకు కారణం మద్యం సేవించి వాహనాల డ్రైవింగ్ చేయడమేనన్నారు. సమావేశంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, నవత ఆటో యూనియన్ అధ్యక్షుడు మోడం సురేష్, నెక్కొండ సొసైటీ చైర్మన్ మారం రాము, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బక్కి అశోక్, ఆటో డ్రైవర్లు శ్రీరంగం శ్రీనివాస్, ప్రభాకర్, భానునాయక్, సత్యనారాయణ, వలీ, రాంచంద్రు, జనగం రాము పాల్గొన్నారు.

- నర్సంపేట : మహాలక్ష్మి పథకంతో నష్టపోయిన ఆటో కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్ డిమాండ్ చేశారు.పట్టణంలో నవతెలంగాణ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కొల్లూరి లక్ష్మినారాయణ, ఆటో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు దేవుళ్ళ ఎల్లి గణేశ్, పెండెం వెంకటేశ్వర్లు, రాజు, భగత్, పెండ్యాల నర్సయ్య తేజావత్ సాయి. గోనెల ప్రేమ్, కాట శ్రీకాంత్, శివ, లింగయ్య, తోకల కరుణాకర్, సాగర్ పాల్గొన్నారు.
- దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలో తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ (తాడు) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శానబోయిన రాజ్‌కుమార్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ అటో కార్మికులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్లు కేటాయించాలన్నారు.కార్యక్రమంలో ఆటో యూనియన్ మండల గౌరవ సలహాదారుడు మోడెం విద్యాసాగర్, నర్సింహరాములు, బాబురావు, బండి శ్రీనివాస్, దేవేందర్, కుమారస్వామి, రాజు, సాంబయ్య, సంజీవ పాల్గొన్నారు.
- ఖానాపురం :మండల కేంద్రంలో గణేష్ ఆటోయూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నర్సంపేట ఏఎంసీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎద్ల జగన్మోహన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్‌చేసి ఆటో డ్రైవర్లకు శుభాకాంక్షలు తెలిపారు. మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. గణేష్ ఆటోయూనియన్ అధ్యక్షుడు మైల యాకాంబ్రం మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గణేష్ ఆటో యూనియన్ ఉపాధ్యక్షుడు ఎస్కే గాలిబ్‌పాషా, కోశాధికారి దేవులపల్లి రామకృష్ణ, రంగు కుమారస్వామి, మడుత బిక్షపతి, సదానందం, సురేష్, షైమద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.
- చెన్నారావుపేట : మండల కేంద్రంలో ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు కంది కృష్ణారెడ్డి మాట్లాడుతూ డ్రైవర్‌ల సంక్షేమం కోసం ప్రభుత్వం పథకాలను ప్రవేశ పెట్టాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బండారి సత్యంగౌడ్. కరెండ్ల శివ, ఉప్పల్లయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను సందర్శించిన అధికారుల బృందం

వర్ధన్నపేట, ఆగస్టు 1 : మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్తమ గ్రామాల సందర్శనలో సెంట్రల్ సెక్రటేరియట్ అసిస్టెంట్ సెక్షన్ అధికారుల బృందం గురువారం మండల పరిషత్ అధికారి కార్యాలయం, పోలీసుస్టేషన్‌లను సందర్శించి ఆయా ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఎంపీవో ధనలక్ష్మి, ఏపీఎం వేణు, ఏపీవో శ్రీపాది నాగేష్, ఈసీ సంకెన రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలి

నర్సంపేట టౌన్, ఆగస్టు 1 : సీజనల్ వ్యాధులను అరికట్టాలని, ఉపాధి హామీ కూలీలకు రావాల్సిన కూలీ డబ్బులను వెంటనే చెల్లించాలని కోరుతూ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఈర్ల పైడి ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో వినతి పత్రం అందజేశారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

- అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వర్ధన్నపేట, ఆగస్టు 1 : రాష్ట్రంలో మహిళా సాధికారతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యతనిస్తూ వినూత్న పథకాలను ప్రతిపాదించిందని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి పేర్కొన్నారు. గురువారం వర్ధన్నపేట మున్సిపాలిటీలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళలను వ్యాపార, పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 'ఇందిరా మహిళా శక్తి' పథకానికి రూపకల్పనచేసిందన్నారు. ఈ పథకం ద్వారా 63 లక్షల మందికి లబ్ధిచేకూరాలనేదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందుకు శ్రీనిధి ఏర్పాటు, బ్యాంకులతో అనుసంధానంతోపాటు పలు మార్గాల ద్వారా ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఈ పథకం ద్వారా మహిళలకు ఆసక్తి ఉన్నరంగాల్లో వృత్తి, నైపుణ్య శిక్షణనిప్పించి మార్కెటింగ్‌లో మెలకువలను నేర్పించేందుకు ప్రభుత్వం సౌకర్యాలు కల్పించనుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ మహిళ సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ, కమిషనర్ జోనా, మెప్మా డీఎంసీ రేణుక, ఏడీఎంసీ వహీదా, ఆర్‌పీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే వ్యాధి నిరోధక శక్తి

నర్సంపేట టౌన్, ఆగస్టు 1 : తల్లి పాలతో శిశువుకు వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్ అన్నారు. పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా గురువారం తల్లులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తల్లి పాలవల్ల కలిగే లాభాలు, తల్లికి, శిశువుకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. తల్లిపాలతో నీళ్ల విరోచనాలు, శ్వాసకోశ వ్యాధులు రాకుండా కాపాడవచ్చన్నారు. సమావేశంలో డాక్టర్ గోపాల్, డాక్టర్ పద్మశ్రీ, విద్య, మార్త తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పలు అంగన్‌వాడీ సెంటర్లలో తల్లి పాల వారోత్సవాలను నిర్వ హించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శిరీష, గొర్రె రాధ, కౌన్సిలర్ దార్ల రమాదేవి పాల్గొన్నారు.

- ఖానాపురం : మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను ప్రారంభించారు. ఆగష్టు 1 నుంచి 7వ తేదీ వరకు జరుపుకునే వారోత్సవాల్లో భాగంగా మొదటిరోజు ర్యాలీ నిర్వహించి, తల్లి పాల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమ, మాధవి, డాక్టర్ జ్యోతి, రాజయ్య, దామోదర్‌రెడ్డి, సునీత పాల్గొన్నారు.
- చెన్నారావుపేట : మండలంలోని ఈర్యతండా అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త మేడి సరోజన మాట్లాడుతూ పుట్టిన ప్రతీ బిడ్డకు ముర్రిపాలు పట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు. గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.
- వర్ధన్నపేట రూరల్ : తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని వర్ధన్నపేట ఐసీడీఎస్ సీడీ పీవో డెబోరా సూచించారు. ఇల్లందలో తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించి, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇల్లందలోని 4, 5 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పటినుంచి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలే ఇవ్వాలన్నారు.కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రకళ, లలిత, అరుణ, నీరజ, సువర్ణ, మాధవి, మాదవిలత, స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.